# రేపటి ఆడపిల్ల

## రాపేటి రామకృష్ణారావు

**'మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అనే సామెత ఎలాగ పుట్టిందో, ఎవరు రాశారో నాకు తెలియదుగానీ నా విషయంలో అది అక్షరాలా నిజమైంది. నాకసలు ఇప్పుడిప్పుడే పెళ్లి చేసుకునే ఉద్దేశ్యమేలేదు. అలాంటి పెళ్లికి తొందర పడుతున్న మా పెదనాన్న కొడుకు పెళ్ళి జరక్కుండా నాది జరిగింది.**

**ఆ రోజు ఆదివారం. నేను మామూలుగా లేచే టైముకే అలారం మోగడంతో ఉదయం అయిదు గంటలకే లేచాను. ఇంటిముందున్న వేపచెట్టు మీది కాకులు ఒకటే అరుస్తున్నాయి.**

నేను విద్యానగర్‌లో ఓ మేడమీద అద్దెకుంటున్నాను. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాలో గుమస్తాని. ఇంకా బ్రహ్మచారిని. రోజూ ఉదయాన్నే లేచి యూనివర్శిటీ దాకా జాగింగ్‌కి వెళ్లి బొటానికల్ గార్డెన్‌లో చల్లని గాలిలో ప్రత్యూష పవనాలు మేనుని తాకుతూ వుండగా కాసేపు సేద తీరిన తరువాత మళ్లీ వెనక్కి పరుగెత్తుకురావడం నా దినచర్య. ఒక గంట జాగింగ్‌లో పోయినా ఇలా ఉదయాన్నే లేవడంవల్ల మరో గంటకన్నా ఎక్కువే కలిసొస్తుంది. బద్ధకం ఎక్కడిదక్కడ ఎగిరి పోవడమేగాక చిరుచెమటల తరువాత చన్నీటి స్నానం లేని హుషారుని తెస్తుంది. నా హుషారుకు ఏమిటి అసలు కారణం అని అడిగే మిత్రులకి ఇదే చెబుతుంటాను.

ఇంటికి రాగానే కోటేశ్వరరావుకిచ్చిన మాట జ్ఞాపకం వచ్చింది. వాడు మా పెదనాన్నగారి ఏకైక సుపుత్రుడు. ఈ రోజే మా పెదనాన్న, పెద్దమ్మ వాడిని తీసుకుని పెళ్లి చూపులకి వెళుతున్నారు. నన్నూ రమ్మన్నారు. ఇష్టం లేకపోయినా బలవంతం మీద తలూపాను.

ఇక్కడ మా కోటేశ్వరరావు బ్రదర్ గురించి నాలుగు వాక్యాలు రాయాలి. నిజానికి వాడు పేరులోతప్ప కోటీశ్వరుడు కాకపోయినా అడ్డంగా ఏ మార్గంద్వారానైనా కోటీశ్వరుడై పోదామనే కోరికగలవాడు. మా ఇద్దరికీ అభిప్రాయంలో చాలా తేడాలున్నాయి. ప్రతి విషయం గురించి చర్చించుకోవడం, విభేదించడం, మళ్లా ఎప్పట్లా కజిన్సమి అయినా స్నేహితుల్లా విభేదాలు మరచిపోయి కలసిపోవడం మామూలే.

వాడూ నాలాగే ప్రభుత్వరంగ బ్యాంకు ఎస్‌బిఐలో గుమస్తా. వాడు వరకట్నాలుండాలంటాడు. అందులో తప్పులేదంటాడు. తల్లిదండ్రుల ఆస్తిలో వాటా ఆడపిల్లలకి ఎలాగూ సమానంగా పంచడం లేదు కాబట్టి వరకట్న రూపంలోనూ, లాంఛనాల రూపంలోనూ పెళ్లిళ్ళప్పుడు రాబట్టడంలో తప్పు లేదంటాడు.

నా ఉద్దేశ్యం వేరు. వాళ్లంతట వాళ్ళు వాళ్ళ స్థోమత నుబట్టి ఇస్తారు. లేకపోయినా ఫర్వాలేదు. అడిగినవాళ్ళని బాధపెట్టడం మంచిదికాదని నేనంటాను. అడగందే అమ్మయినా పెట్టదు అంటాడు వాడు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆ రోజు వాళ్ళతో నేను పెళ్లిచూపులకి వెళ్లాను.

గబగబా స్నానంచేసి టిఫిను కానిచ్చి నా హీరోహోండామీద చిక్కడపల్లిలోని మా పెదనాన్నగారి ఇంటికి 8.30కల్లా చేరుకున్నాను. మా కోటేశ్వరరావు అప్పటికే తయారై పెళ్లికొడుకుగా రెడీగా వున్నాడు. వాళ్ళది పెద్ద భవనం కాకపోయినా కట్టించుకున్న సొంత ఇల్లు.

• • •

కారులో మారేడుపల్లిలోని పెళ్లివారి ఇల్లు చేరుకునే సరికి పది దాటింది. సాదరంగా ఆహ్వానించగా పెళ్లి హాల్లో కూర్చున్నాం. లోపల ఎంతో నీట్‌గా వుంది. మంచి అభిరుచిగల మధ్య తరగతి కుటుంబం అని నాకర్థమైంది. పరిచయాలయ్యాయి. కోటేశ్వరరావు నన్ను వాళ్ళకి పరిచయం చేసాడు.

పెళ్లికూతురి తండ్రి పేరు జగన్నాధరావు. అమ్మ పేరు అన్నపూర్ణమ్మ. కాబోయే పెళ్లికూతురి పేరు సమత. ఎంతో సింపుల్‌గా తయారై వచ్చి మా ముందు కూర్చుంది. మేకప్ అసలు చేసుకోనేలేదు. బిఎస్‌సి పాసై ఏదో కంప్యూటర్ కోర్స్ చేస్తున్నది చెప్పారు.

పిల్ల చాలా బాగుంది. కాబోయే వదిన గనక నా మనసులో మాట రాయకూడదుగానీ నాకు మరీ నచ్చింది. సంబంధం ఓకే అయితే కోటేశ్వరరావు లక్కీ ఫెలో అనిపించింది.

వధూవరులు ఒకరికొకరు నచ్చడంతో కట్నకానుకలు, లాంఛనాల ప్రవహనం మొదలైంది.

జగన్నాధరావుగారు ఏడాది క్రితమే రిటైరయ్యారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ కూతురి పెళ్లికి దాచి వుంచారు. వాళ్ళబ్బాయికి ఎమ్‌సెట్‌లో మంచి రాంకు వచ్చి ఉస్మానియాలోనే ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తున్నాడు. కూతురు పెళ్ళయితే చాలు అని చూస్తున్నారు. మా పెద్దమ్మ వాళ్ళకేమేం పెట్టాలో ఏకరువు పెట్టింది.

''మావాడు బేంకు జాబ్ చేస్తున్నాడు. చాలా సంబంధాలు వచ్చాయి. అమ్మాయిలు వాడికి నచ్చడంలేదు. మీ అమ్మాయి నచ్చింది. కనుక మేము ఎక్కువ కట్నకానుకలు ఆశించం. మూడు లక్షల కట్నం, మోటారు సైకిలు, కలర్ టీవీ, సోఫా సెట్, డైనింగ్ సెట్ పెట్టండి చాలు'' అని ముగించింది.

నేను సమతని గమనిస్తూనే వున్నాను. మా పెద్దమ్మ ఒకో డిమాండ్ దండకంలాగా చదువుతున్నకొద్దీ ఆమె ముఖంలో రంగులు మారిపోయాయి. ముఖం ఎర్రబడింది. మా కోటిగాడివేమీ గమనించడంలేదు.

''అమ్మా! డబుల్‌కాట్ మంచాలు, బెడ్స్ సంగతి మరచిపోయావు. పెళ్లి ఘనంగా చెయ్యాలని చెప్పు'' గుర్తు చేసాడు.

''మంచాలు మనవద్దన్నా ఇస్తారులేరా! పెళ్లి మాత్రం ఘనంగా జరిపించరా! అవీ చెప్పాలా. నువ్వూరుకో'' అంది.

జగన్నాధరావుగారు ''అమ్మా! నేను రిటైరైనప్పుడు వచ్చిన డబ్బు, నా మొత్తం సేవింగ్స్ అన్నీ దాని కోసమే. అవన్నీ కలిపినా ఐదు లక్షలు కావు. మీరడిగినవన్నీ పెట్టి పెళ్ళి ఖర్చులు జరిపించడం నావల్ల అయ్యేలాగా లేదు. కట్నం రెండు లక్షలు చేసు కోండి'' అన్నాడు.

పెళ్లికూతురు తల్లి [illegible] కుందాంలెండి. [illegible] తుందా?'' అంది.

నేను చూస్తూ ఊరుకున్నాను.

సమత లేచి నిలబడి ''డాడీ! సంబంధం ఖాయం చేసేముందు నేను ఆయనతో ప్రయివేటుగా మాట్లాడాలి'' అని కోటేశ్వరరావు వేపు చూసింది.

''దానికేం వెళ్ళరా కోటీ'' మా పెద్దనాన్న, పెద్దమ్మ అనుమతించారు.

వాళ్లిద్దరూ హాలుని ఆనుకునివున్న ఒక రూములోకి వెళ్లారు. ఏం మాట్లాడుతున్నారో తెలియదు. మా కోటిగాడు ముఖం ధుమధుమలాడుతూ వుండగా బయ

టకొచ్చాడు.

''నాకీ పిల్ల నచ్చలేదు నాన్నా. గర్వం చాలా ఎక్కువగా వుంది. ఈమె ఇంట్లో అడుగుపెట్టిందో మనల్ని వీధిలోకి నెట్టేస్తుంది. లేవండి వెళ్లిపోదాం'' అన్నాడు.

నాకేం అర్థంకాలేదు. వెనువెంటనే లేచి కారులో చిక్కడపల్లి బయలుదేరాం. అందరి ముఖాలు ప్రసన్నతని పోగొట్టుకున్నాయి. కోటేశ్వరరావు ముఖంలో రక్తం చుక్క వున్నట్లులేదు. మరోనెల రోజులదాకా కోలుకోడేమో అనిపించింది.

• • •

ఆ మరునాడు పనిగట్టుకుని ఆ పిల్ల ఏమన్నదో తెలుసుకుందామని మా పెదనాన్న వాళ్ళ ఇంటికి వెళ్లాను. వాడి రూములో ఇద్దరం కూర్చున్నాం.

''ఏమైందిరా కోటీ! నిన్న అలాగ ఏ మాటా చెప్పకుండా బయటకి లాక్కొచ్చావేం. ఆ అమ్మాయి అసలేం చెప్పింది'' అడిగాను.

''ఆ అమ్మాయికి చాలా పొగర్రా'' అన్నాడు చాలా కోపంగా.

''ఇంతకీ ఏమన్నదో అది చెప్పరా!''

''కోటేశ్వరరావుగారూ! నిజంగా మీకు నేను నచ్చానా? అనడిగింది. ఔనన్నాను. అలాగైతే ఈ కట్నకానుకల ప్రసక్తిలేకుండా నన్ను పెళ్ళి చేసుకోవడానికి మీరు రెడీయేనా? అనడిగింది. నువ్వు నాకు నచ్చావు. కట్నకానుకల విషయానికొస్తే అది మా అమ్మానాన్నల ఇష్టం అని చెప్పాను. వాళ్లొప్పుకోకపోతేనో అంది. దానికి నేనేం చేయలేను అని చెప్పాను. తరువాత ఇంక అందుకుందిరా ఏకవచన ప్రయోగంతో సిగ్గులేకుండా 'కోటేశ్వరరావు! మీ అమ్మ అడిగిన వాటికీ సిగ్గులేకుండా నువ్వడిగిన డబుల్ కాట్కూ, జూలూరి వజ్రమ్మ హాలులో పెళ్లికీ రిసెప్షన్‌కీ, నాకు పెట్టే బంగారంతో కలిపి ఎనిమిది లక్షల దాకా ఖర్చవుతాయి. ఆ డబ్బుని కూడా నేనడుగుతాను. ఆయన ఇస్తారు. నా మాట కాదనరు. మనం రిజిస్టర్ మేరేజ్ చేసుకుందాం. ఆ డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేద్దాం. నువ్వు మా ఇంటికి వచ్చేయ్. మీ అమ్మా, నువ్వూ అడిగిన సౌకర్యాలన్నీ మా ఇంట్లో ఉన్నాయి. అన్నీ మా డాడీ చూసుకుంటాడు. దానికి నువ్వు రెడీ అయితే నేను ఈ పెళ్లికి రెడీ. లేకపోతే ఇంక మీరు దయచేయవచ్చును' అనేసిందిరా. నేను స్టన్ అయిపోయాన్రా. నాకు నోట మాట కూడా రాలేదు. అందుకే పెళ్లి కాన్సిల్ చేశాను'' అని మొత్తం కథ చెప్పాడు.


నాకు చాలా సంతోషం వేసింది. ఈ సమత రేపటి ఆడపిల్ల. ఆడపిల్లలందరూ ఈమెలాగే కట్నం అడిగే వాడిని చేసుకోం అనంటే వరకట్న దురాచారం దానికదే పోతుందికదా. ఎందుకని ఈ అమ్మాయిలు అర్థం చేసుకోరు. అందంగా వుంటారు, ఉద్యోగాలు కూడా చేస్తూ కూడా వరకట్నాన్ని ఎందుకు వ్యతిరేకించరో అనిపించింది.

నాకు సమత రూపం నచ్చడమేకాదు, అభిప్రాయాలూ నచ్చాయి. ఎందుకని సమతలాంటి ఆదర్శ భావాలున్న అమ్మాయిని చేసుకోకూడదు. ఇంట్లో రెండేళ్ళుగా పెళ్లి చేసుకోమని గొడవ పెడుతున్నారు.

''నీకు నచ్చిన అమ్మాయినే చేసుకోరా. పోనీ ఎవర్నైనా ప్రేమించావా? అలాంటి శుభవార్త వుంటే చెప్పరా. ఆ అమ్మాయినే చేసుకోరా'' అని అమ్మా నాన్నా చంపుతున్నారు. ఓ నిర్ణయానికి వచ్చేసాను.

''వస్తాన్రా'' అని కోటిగాడికి చెప్పి నా గదికి వచ్చేసాను. గదిలో ప్రవేశించి కాగితం కలం తీసుకున్నాను. జగన్నాథరావుగారి

ఇంటి నెంబరు నా



మనస్సులో వుంది. మారేడ్‌పల్లికి లెటర్ వ్రాయాలనుకున్నాను.

సమతగారికి,

అభినందన పూర్వకంగా నమస్కారములు.

నేనెవర్నో మీకు తెలుసు. మొన్ననే మీ ఇంటికి పెళ్ళిచూపులకని మా కజిన్ కోటేశ్వరరావుతో వచ్చాను. మావాడు నన్ను మీకు పరిచయం చేసాడు. ఆ ప్రకాష్‌నే రాస్తున్నాను. ఆ రోజే మీరు నాకు నచ్చారు. మా కోటిగాడు అదృష్టవంతుడనుకున్నాను. మీ అభిప్రాయాలూ, ఆదర్శాలూ నాకు నచ్చాయి. నేనూ బేంకు గుమస్తానే. ఆ రోజు మీరు నన్ను శ్రద్ధగానే గమనించారు. నేను కనుక మీరు నచ్చితే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను.

నాకు కట్నాలు, కానుకలు, పెళ్లిచూపులు, పెట్టుపోతలు, లాంఛనాలు అంటే పరమ అసహ్యం ఈ పద్ధతులు మారాలి. కానీ మీ ఒక్క షరతు మాత్రం నేను అంగీకరించలేను. మీ ఇంటికి ఇల్లరికం రాలేను. పెళ్లి చెరి సగం ఖర్చులతో చేసుకుందాం. మీకూ మీ అమ్మగారికీ, నాన్నగారికీ నా ప్రపోజల్ నచ్చితే నాకు రాయండి. ఏ సంగతీ నేనిచ్చిన చిరునామాకి రాయండి.

ఇట్లు

మీ అభిప్రాయాలను గౌరవిస్తున్న

మీ

ప్రకాష్

లెటర్ పోస్టు చేసాను.

వారంరోజుల్లోనే సమాధానం వచ్చింది. పెళ్ళి ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. నాకు నచ్చిన భార్య, నన్ను మెచ్చిన భార్య నాకు దొరికింది. మా పెళ్లి నిజంగానే స్వర్గంలో కుదిరింది. ఘనంగా జరిగింది.

★